
క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


పంచారామక్షేత్రంలో సూర్యనారాయణమూర్తి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో మాఘ ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మాఘ మాసం అనగానే సూర్య మాసంగా భావిస్తారు. దీనికి తోడు ఆదివారం సూర్యనారాయణ మూర్తికి ప్రీతికరమైన రోజు కావడంతో పంచారామ క్షేత్రంలోని సూర్యనారాయణమూర్తి ఆలయంలో అర్చకులు శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మలు స్వామివారికి పూజలు, అభిషేకాలు చేశారు.

పండిట్ దీనదయాళ్ వర్ధంతి


పిఠాపురంలో పండిట్ దీనదయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

పిఠాపురం: స్థానిక బీజేపీ కారాలయంలో ఆదివారం పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి నిర్వహించారు. కాకినాడ జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ రావూరి సుధాకర్ ఆధ్వర్యంలో పండిట్ దీనదయాళ్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీకి పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ కాకినాడ పార్లమెంట్ కన్వీనర్ రాంబాల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు వత్సవాయి వరమాల బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకటసూర్యనారాయణరాజు, గండి కొండలరావు, బుర్రి మురళీధరరావు, పార్టీ పిఠాపురం పట్టణాధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, అల్లుబోయిన సూరిబాబు, అడబాల శ్రీనివాసు, కర్నీడి తాతీలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి


మర్లావలో పండిట్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దాపురం: గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసేందుకు పల్లెబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి రావూరి సుధ అన్నారు. మర్లావలో ఆదివారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల పద్మజ ఆధ్వర్యంలో పర్యటించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించి పండిట్ దీనదయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సుధ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. కేంద్ర పథకాలను వివరించేందుకు వికసిత్ భారత్ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు.

ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలవండి


పెద్దాపురంలో విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దాపురం: ప్రజా ఉద్యమాలకు ప్రతి ఒక్కరూ బాసటగా నిలవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ అన్నారు. స్థానికంగా సీపీఐ తరపున ఆదివారం విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. ప్రజలను దోచుకుంటున్న కేంద్రంలోని బీజేపీని గద్దె దించాలన్నారు. తాటిపాక మధు మాట్లాడుతూ ఈ నెల 16న జరిగే గ్రామీణ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పద్మశాలి సంఘ సమన్వయకర్తగా 'పొన్నగంటి'

కాకినాడ: కోస్తా ఆంధ్ర పద్మశాలి సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సమన్వయకర్తగా పొన్నగంటి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు కోస్తా ఆంధ్ర పద్మశాలి సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. పొన్నగంటి సత్యనారాయణ అఖిల భారత పద్మశాలి సంఘ కార్యదర్శిగా, అఖిల భారత పద్మశాలి తిరుపతి అన్నసత్రం ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు.

జిల్లా దేవదాయ శాఖ అధికారికి పదోన్నతి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లా దేవదాయ శాఖాధికారి పులి నారాయణమూర్తికి అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. గ్రేడ్–1 ఈఓగా ఆయన పెద్దాపురం మండలం తొలి తిరుపతిలోని శృంగార వల్లభస్వామి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన్ని పిఠాపురంలోని కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా నియమించారు.

సుపరిపాలన

- పాడి రైతులకు ప్రభుత్వ సహకారం
- పరిశ్రమకు అన్నివిధాలా తోడ్పాటు



సామర్లకోట: సాగుకు అనుబంధం పాడి పరిశ్రమ.. దీనితో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతోంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ పరిశ్రమ కుదేలైంది.. అన్నింటా నష్టాలను చవిచూసింది.. పాడి పరిశ్రమను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. ఈ పరిశ్రమను ప్రోత్సహించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రస్తుతం నియోజకవర్గంలో 24 వేల పాడి పశువులు, ఆరు వేల మంది పాడి రైతులు ఉన్నాయి. గతంలో పాలకు తగిన ధర లేక పోవడంతో వీరంతా ఇబ్బంది పడేవారు. రాష్ట్ర ప్రభుత్వం అమూల్ సహకారంతో రూ.50 ఉండే లీటరు పాల ధరను రూ.70కి పెంచింది.

అభివృద్ధికి బాటలు

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా ఆర్థిక సాయం అందించడంతో మహిళలు గేదెలను కొనుగోలు చేసుకుని పాల వ్యాపారం చేస్తున్నారు. మహిళా సంఘాల్లోని సభ్యులు ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక ఆసరాను పెట్టుబడిగా పెట్టి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొంటున్నారు. ఇలా పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేస్తోంది. ఇదిలాఉంటే పాడి పరిశ్రమలో ప్రధానమైన గడ్డి కొరత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దాళ్వా కోతలు పూర్తయిన తరువాత రైతులకు గడ్డి కొరత రాకుండా పచ్చిరొట్ట ఎరువులు అందజేస్తుంది. తద్వారా పశువుల దాణాలకు ఇబ్బంది రాకుండా చూస్తోంది. వ్యవసాయ రంగంలో కూలీల కొరతతో వరి కోతలకు యంత్రాలు ఉపయోగిస్తున్నారు. మెషీన్లతో కోత కోయించి ధాన్యం ఇళ్లకు చేర్చుకుంటున్నారు. అయితే మెషీన్లతో వచ్చిన గడ్డి పని చేయడం లేదనే అపోహలు అందరిలో ఉంది. కోతలు పూర్తయిన వెంటనే ఆ గడ్డిని జాగ్రత్తగా మేట్లు వేసుకోవడం ద్వారా పశువులకు దాణాగా వేసుకోవచ్చని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

పొలంలోనే పాల డైరీ



పశువులకు ఎండు గడ్డి ఎంతో మేలు చేస్తుంది. దాంతో కొన్ని సమయాల్లో గడ్డి కొనుగోలు చేసుకుంటున్నాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాడి రైతులకు మేలు చేసే విధంగా అనేక చర్యలు తీసుకున్నారు. దీనివల్ల పొలంలోనే కోళ్లఫారంతో పాటు గేదెలను పెంచి పాల డైరీ నిర్వహించుకుంటున్నాను.

– తలారి దొరబాబు, పాల వ్యాపారి, వీకే రాయపురం

గడ్డి కొరత లేకుండా..



వరి కోత యంత్రాలతో వచ్చిన గడ్డిని జాగ్రత్తగా మేట్లు వేసుకుంటే పశువులకు మేతగా ఉపయోగించుకోవచ్చు. అనేక మంది రైతులు యంత్రాలతో కోతలు పూర్తయిన తరువాత నిప్పు పెడుతున్నారు. దీనివల్ల భూసారం తగ్గే ప్రమాదం ఉంది. దాళ్వా కోతలు పూర్తయిన తరువాత రైతులకు గడ్డి కొరత లేకుండా పచ్చిరొట్ట ఎరువులు అందజేయడానికి ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతం పశువులకు దాణా కొరత లేదు.

– తాతయ్య, పశుసంవర్ధక శాఖ ఏడీ, సామర్లకోట

ప్రభుత్వ సాయంతో..



రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న ఆసరా పథకంలో వచ్చిన రూ.40 వేలతో పాటు చేయూత పథకంలో వచ్చిన మొత్తం కలిపి బ్యాంకు రుణంతో గేదెను కొనుగోలు చేశాను. పాల ధర పెరగడంతో వ్యాపారం లాభసాటిగా మారింది. గేదె కొనుగోలుకు మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత ప్రోత్సాహం అందించారు.

– శివగంగా, పాడి రైతు, సామర్లకోట

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. ఆదివారం స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

ప్రత్యేక రైలులో అయోధ్యకు..


అయోధ్యకు బయలు దేరిన సామర్లకోట ప్రయాణికులు

సామర్లకోట: అయోధ్యలోని శ్రీరామ మందిరం తిలకించే వారి కోసం రైల్వే శాఖ ఆదివారం కాకినాడ నుంచి ప్రత్యేక రైలును ఏర్పాటు చేసింది. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుకింగ్ చేసుకున్న స్థానిక భాస్కర్ కాలనీకి చెందిన 50 మంది అయోధ్యకు ఈ ప్రత్యేక రైలులో బయలుదేరారు. రూ.1,700 టిక్కెట్‌తో రైలులో రాకపోకలతో పాటు భోజనాలు, ఆలయంలో దర్శనం, రూములు కల్పిస్తున్నట్లు ప్రయాణికుడు వేగు సత్యనారాయణ తెలిపారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో దవులూరి సుబ్బారావు

సామర్లకోట: పెద్దాపురం మండలం వాలుతిమ్మాపురం గ్రామంలో పలువురు టీడీపీ కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దవులూరి సుబ్బారావు పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా వాలుతిమ్మాపురానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరేందుకు ముందుకు రావడంతో ఆ గ్రామ సీనియర్ నాయకుడు బచ్చల రాజు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. గ్రామ 8వ వార్డు సభ్యులు పిల్లి చంటితో సహా 20 మంది పార్టీలో చేరారు. సామర్లకోట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మోరంపూడి శ్రీరంగనాయకులు, ఎంపీటీసీ సభ్యుడు రాయి వెంకటేశ్వరావు, వరందాసు చినరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నసమారాధన

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డు విఘ్నేశ్వరా థియేటర్ ఎదురుగా ఉన్న రాధా సమేత వేణుగోపాల స్వామి (కృష్ణుడు గుడి) ఆలయం వద్ద సోమవారం ఉదయం 11 గంటల నుంచి భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో నెల రోజుల పాటు వివిధ కార్యక్రమం జరిగాయి. ఈ మాసం ముగియడంతో అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ..


తిరుపతి యాత్రకు వెళ్తున్న వైఎస్సార్ సీపీ బృందం

పెద్దాపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరుతూ పెద్దాపురం పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు తిరుపతికి బస్సు యాత్ర చేపట్టారు. ఈ యాత్రను మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, తాడి రాజశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. కౌన్సిలర్ విడదాసరి రాజా మిత్ర బృందం తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయానికి యాత్రగా బయలుదేరి వెళ్లారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం


రమణయ్యపేటలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: రమణయ్యపేట కొత్తూరు వద్ద ఏడీబీ రోడ్డును ఆనుకుని రూ.30 లక్షల నిధులతో కొత్తగా నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమణయ్యపేటలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను యువత కోసం అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మండల ఇంజినీర్ వాసుదేవరావు, డీఎల్‌డీఓ నారాయణ మూర్తి, ఇతర అధికారులకు నిర్మాణ పనుల్లో పలు సూచనలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్, నాయకులు గంజా సత్తిబాబు, రాయుడు నాగేశ్వరరావు, పెంకే రమణ, గోపుశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

బాలాజీచెరువు: స్థానిక ఆర్ఎంసీ క్రీడా మైదానంలో యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. క్రికెట్, చెస్, షటిల్, క్యారమ్స్ తదితర పోటీలు నిర్వహించగా ఏడు జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను యూనియన్ ప్రెసిడెంట్ రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ జీఎస్‌వీ శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


వాకతిప్పలో 22 ఏళ్ల తరువాత కలసిన పూర్వ విద్యార్థులు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలకు చెందిన 2002–2003 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 22 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు రావు చిన్నారావును శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులకు సుమారు రూ.50 వేలు విలువ చేసే కంప్యూటర్‌ను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌కు అందజేశారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బీరులో సిరా కలిపిన వ్యక్తిపై కేసు

కాకినాడ క్రైం: బీరులో సిరా కలిపి కల్తీకి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఆ వివరాల్లోకి వెళితే.. స్థానిక జగన్నాథపురం ఏటిమొగకు చెందిన పట్టా వెంకటేశ్వర్లు ఈ నెల 5న తన కుమారుడి ద్వారా జె.రామారావుపేటలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఓ కంపెనీకి చెందిన రెండు బీరు సీసాలు కొనుగోలు చేశాడు. ఇంటికి తీసుకొచ్చి ఓ సీసాలో మద్యం తాగాడు. మరో బాటిల్ కూడా తాగేందుకు సిద్ధమయ్యే సరికి అందులో నీలిరంగు ద్రవం ఉందని, అదేరోజు రాత్రి 9.50 గంటల సమయంలో మద్యం దుకాణానికి వెళ్లి గొడవ పెట్టుకున్నాడు. తిరిగి 6వ తేదీ ఉదయం మరోమారు వచ్చి తీవ్ర దూషణతో హల్‌చల్ చేశాడు. ప్రభుత్వం, అధికారులపై ఆరోపణలు చేశాడు. దీంతో ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమయ్యారు. తక్షణమే అక్కడికి చేరుకున్న అసిస్టెంట్ రిటైల్ అవుట్‌లెట్ మానిటరింగ్ ఆఫీసర్ కృష్ణవేణి బృందం ఆరోపిస్తున్న వ్యక్తి వద్ద ఉన్న బాటిల్‌లోని మద్యం నమూనాలు సేకరించింది. అలాగే, అదే బ్యాచ్‌కు చెందిన కొన్ని వందల సీసాలలో నమూనాలను సైతం సేకరించారు. వీటిని గుంటూరులోని ప్రభుత్వ రీజినల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ల్యాబొరేటరీకి పరీక్షల నిమిత్తం పంపినట్లు డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కాకినాడ జయరాజు, సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ తెలిపారు. ఆ నివేదిక శనివారం రాత్రి అందడంతో వెంకటేశ్వర్లు కుటిల యత్నం బయట పడిందన్నారు. కొన్ని బాటిళ్లలో ఎటువంటి కల్తీ జరగలేదని, ఇంటికి తీసుకువెళ్లి సిరా కలిపి ఆ బాటిల్ తీసుకువచ్చి హల్‌చల్ చేశాడని స్పష్టమైందని వివరించారు. దీంతో ఎక్సైజ్ అధికారులు కాకినాడ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం, యంత్రాంగం, శాఖపై తప్పుడు ఆరోపణలు చేసిన వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు సీఐ వి.సురేష్‌బాబు చెప్పారు. ఈ నేరంలో అతడితో పాటు మరెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆధ్యాత్మికం.. ఆనంద పరవశం



సర్పవరం భావనారాయణ స్వామిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు. రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి

- మాఘ మాస సందడి ఆరంభం
- భావనారాయణ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కాకినాడ రూరల్: పురాతన ప్రసిద్ధ క్షేత్రం సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయంలో మాఘ మాస ఉత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు ఆలయంలో స్వామివారి దర్శనాలతో పాటు పాలు పొంగించి నైవేద్యంగా సూర్యభగవానునికి సమర్పిస్తుంటారు. తొలి ఆదివారం ఆలయం వద్ద తిరునాళ్లు ఘనంగా జరిగాయి. ఆలయం ఎదురుగా నారద గండం వద్ద పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయ ప్రాంగణంలో పాలు పొంగించి సూర్య నమస్కారాలు, నైవేద్యం సమర్పణ అనంతరం దర్శనాలు చేసుకున్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు పర్యవేక్షణలో ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, సభ్యులు, ఈఓ భీమశేఖరరావు, గ్రామస్తుడు పుల్ల చందు తదితరులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి సుమారు 25 వేల మంది భక్తులు వచ్చినట్లు అంచనా వేస్తున్నారు. రెండు, మూడు ఆదివారాలు ఎక్కువగా భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్టు చైర్మన్ నారాయణరావు తెలిపారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులందరికీ మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఘంటసాల గీతాలు సజీవం


ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి

బోట్‌క్లబ్: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు మన మధ్య లేకున్నా ఆయన గీతాలు సజీవంగానే ఉన్నాయని మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి అన్నారు. స్థానిక గాంధీనగర్ పార్కులో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘంటసాల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గుండోజు అరుణాకరరావు, మేడిశెట్టి శ్రీరాములు, కోడిగుడ్డు సత్యం, సీహెచ్ వెంకటరమణ మూర్తి ఆధ్వర్యంలో ఘంటసాల సంగీత విభావరి జరిగింది. గాయకులు ఘంటసాల పాటలను మధురంగా ఆలపించారు. అనంతరం నిర్వాహకులను 41వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గోడి వెంకట్ ఆధ్వర్యంలో సత్కరించారు. వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మేరీమాత యాత్ర మహోత్సవం


ప్రత్తిపాడు మరియగిరిపై ప్రసంగిస్తున్న పాస్టర్ క్రీస్తురాజు


ప్రత్తిపాడులో మేరీమాత పుర ప్రదక్షిణ

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ప్రత్తిపాడులో సందడి వాతావరణం

ప్రత్తిపాడు: స్థానిక ఆర్‌సీఎం చర్చి పాస్టర్ కె.చిన్నప్ప ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్తిపాడులో మేరీమాత యాత్ర మహోత్సవం వైభవంగా జరిగింది. మరియగిరిపై జరిగిన ఈ వేడుకకు ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలేశ్వరం, పిఠాపురం, గొల్లప్రోలు తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో క్రైస్తవ భక్తులు తరలివచ్చారు. ఉదయం స్థానిక ఆర్‌సీఎం చర్చిలో పాస్టర్ చిన్నప్ప ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం మేరీమాత విగ్రహాన్ని తేరుపై ఉంచి, పుర ప్రదక్షిణ చేపట్టారు. బాణసంచా కాల్పుల నడుమ మేరీమాతను ఊరేగించారు. తేరు ఆర్‌సీఎం చర్చి నుంచి బయలుదేరి ఆర్టీసీ కాంప్లెక్స్, మార్కెట్, ఎంప్లాయీస్ కాలనీ మీదుగా మరియగిరికి చేరుకుంది. అనంతరం దివ్య పూజాబలి మహోత్సవాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ క్రీస్తురాజు ప్రధాన దివ్య పూజాబలిని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ప్రతిఒక్కరూ సాటి మానవుని పట్ల కరుణ, ప్రేమతో మెలగాలన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు. సామర్లకోట, అనపర్తి, కాకినాడ, రాజమహేంద్రవరం నుంచి వచ్చిన పాస్టర్లు ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం కమిటీ సభ్యులు జి.సత్యానందం, దాసు, వీరరాఘవ, జాయ్, వివిధ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన నవదిన ప్రార్థనలు

మరియగిరి కొండపై గత తొమ్మిది రోజులుగా ఆర్‌సీఎం చర్చి పాస్టర్ కె.చిన్నప్ప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలు శనివారం రాత్రితో ముగిశాయి. అనంతరం మేరీమాతను ప్రత్యేక పల్లకిలో ఉంచి క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.


జాతరను తలిపించిన ప్రత్తిపాడు మేరీమాత యాత్ర మహోత్సవం

జాతరను తలిపించిన మహోత్సవం

మేరిమాత యాత్ర మహోత్సవం జాతరను తలపించింది. సుదూర ప్రాంతాలకు చెందిన వేలాది మంది మరియగిరి బాట పట్టారు. రహదారి వెంబడి దుకాణాలు వెలిశాయి. యాత్రకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తీరంలో పర్యాటకుల సందడి


పర్యాటకులతో సందడిగా మారిన ఉప్పాడ సాగరతీరం

కొత్తపల్లి: మండలంలో ఉప్పాడ సాగరతీరం ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. ఉప్పాడ నుంచి కాకినాడ వరకూ ఉన్న తీర ప్రాంతంలో పర్యాటలకులు సందడి చేశారు. సెలవు రోజు కావడంతో నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు కుటుంబ సమేతంగా బీచ్‌కు వచ్చారు. యువత కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. ఆటపాటలతో సందడి చేశారు. తీర ప్రాంతం వెంబడి నిలువ నీడ లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. తీరంలో వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.